కథానిక

# వ్యవహార మార్తాండుడు

పోగుల కోటేశ్వరరావు

పరిసరాలలోని పధ్నాలుగూళ్ళలోనూ పలుకుబడి సంపాదించి తనుగీచిన గీటు దాటకుండా, తాను చెప్పిందే వేదంలో ముక్కగా అంగీకరింప జేశాడంటే వీరభద్రరావుగారి శక్తి సామర్ధ్యాలు ఇక వేరుగా విన్నవించుకోవాల్సిన అవసర మేముంటుంది? ఒక్కొక్క లక్షణానికి మనపురాణాల్లో ఒక్కొక్క చిల్లర దేవుణ్ణి నియమించినట్టు యే నాటికైనా ఆదిదేవుడు వ్యవహార మార్తాండుడను సృష్టించదలచుకుంటే సర్వీసు కమీషన్లు, ఇంటర్వ్యూలు గొడవ లేకుండా సరాసరి వీరభద్ర రాజుగారికి ఆహ్వానం పంపించి ఆ పదవిని కట్టబెడతాడని చెప్పడం ఎంతమాత్రమూ అతిశయోక్తి కానేరదు. అంతటి సమర్థుడైన వీరభద్రరావుగారు సిరిసంపదలతో పాటు పిల్లాజెల్లా కలిగియున్న రామయ్యగారి ఇంటి వ్యవహారాలు చక్కదిద్దుతానని స్వయంగా వచ్చి తెలియజేస్తే ఆయనమాత్రం కాదని చెప్పి చేజిక్కిన అవకాశాన్ని చేతులారా జారవిడుచుకుంటాడా? ఒక గొప్పవాడికి తన ఆస్థానంలో స్థానం ఇవ్వడం తన ఘనతకు ఎంతైనా తోడ్పడుతుందని భావించాడు రామయ్య. అడగటమే తడవుగా సరేనని తలకాయ ఎగరేశాడు. ఇంతకాలంగా తుమ్మా దుమ్మాగా పడివున్న తన కుటుంబ వ్యవహారాలన్నీ ఇంతటితో చక్కదిద్దబడతాయని ఆశించాడు. తన సంసార నౌకను సాగరంలో నుంచి దరిచేర్చేందుకు వీరభద్రరాజుగారు చక్కని చుక్కాని కాగలడని రామయ్యపొంగిపోయాడు.

కనుక నిన్నటి వరకూ గ్రామాన్ని చుట్టు ప్రక్కల చిన్న చిన్న వూళ్ళను ఉద్ధరించి పారేసిన వ్యవహార మార్తాండుడు శ్రీ వీరభద్రరాజుగారు ఇప్పుడు కేవలం రామయ్యగారి ఇంటి గొడవలకు అటువిడుపు చెప్పేందుకే తన శరీరాన్నంతటినీ ధారబోసేందుకు సంసిద్ధుడయ్యాడన్నమాట. ఈ వార్త ఆగ్రామంలోని ప్రజలకు మరునటి రోజుకల్లా పొక్కిపోయింది. రకరకాల వ్యాఖ్యానాలు బయలు దేరినాయి. చప్పరించేసిన వాళ్ళు కొందరు, ముసిముసి నవ్వులతో హేళనగా కనుబొమ లెగరేసినవాళ్ళు మరికొందరూ, ఎవరెట్లాపోతే మనకెందుకులే అని ముభావంగా ఊరుకున్నవారు మరికొందరూ, 'ఇహ బాగుపడ్డట్టే' అని గీర్వాణం చేసినవాళ్ళు ఇంకా కొంతమంది - ఈ రకంగా మొత్తంమీద గ్రామంలోని ప్రజలందరిలో తీవ్రమైన సంచలనం కలిగింది.

వీరభద్రరాజుగారిలో విశేషించి చెప్పుకోవాల్సిన ప్రత్యేకత ఒకటి వివరంగా తెలుసుకోవడం అనవసరంకాదు. వాడెంతలావు మనగాడయినప్పటికీ ఎదుటివాడు చెప్పినమాటకు విలువఇచ్చామా అంటే అది ఆత్మగౌరవానికి భంగం కలిగించుతుందని ఆయన దృఢ విశ్వాసం. అందుచేత యే సందర్భంలోనైనా సరే చర్చించే విషయంలో తనకు ఓనమాలు వచ్చినంత మాత్రపు ప్రవేశం కూడా లేకపోయినా తనమాట నిలబెట్టుకునేందుకు తాపత్రయ పడేవాడు. ఆయన నోటి ధాటికి వెరచి కానీయండీ, లేక ఆయనకు ఆగ్రహము కలిగించినందువల్ల పరిపరి విధాల చిక్కులకు లోనుగావలసి వస్తుందని గానీవ్వండీ, లేక ఆయనతో నెరవేరవలసిన పనులకు ఆటంకం యేర్పడుతుందని గానివ్వండీ యెవరికివారు లొంగిపోయే వాళ్ళేగాని, యే ఒక్కరూ కూడా ఆ గ్రామంలో ఆయన్ను ప్రతిఘటించిన పాపాన పోలేదు. అందుచేత ఆ గ్రామంలో తనకంటె తెలిసిన వాడెవ్వడూ లేడని వీరభద్రరాజుగారు అక్షరాలా రుజువు చేసుకోగలిగాడని చెప్పక తప్పదు. సుప్రీం కోర్టుదాకా అప్పీలు చేసుకున్నప్పటికీ ఈ నిరూపణకు తిరుగులేదు.

రామయ్య గారింట్లో ఉద్యోగం స్వీకరించిన

తదాది వ్యవహారవిషయాలన్నింటినీ వీరభద్రరాజు గారు తన స్వంతపనుల్లాగా చూచుకుంటూ వుండేవాడు. అంతేగాదు రామయ్యగారి సంసారం గొడవలు మరింతగా పట్టించుకుని కడతేరుస్తాడని కొంతమందికీ, కూలద్రోస్తాడని మిగతా వారికీ అభిప్రాయం కలిగించాడు. న్యాయశాస్త్రంలో ఆయనగారి అపారమైన పాండిత్య ప్రకర్షనంతటినీ ప్రయోగించి రామయ్యగారికాపురం చక్కదిద్దేందుకు పూనుకుని ఆయన ప్రజ్ఞను లోకానికి చాటేందుకు ఉద్యుక్తుడయ్యాడు.

రామయ్యగారి పెద్దకొడుకు మతి భ్రమించినవాడని కొంతకాలంగా లోకం అనుకుంటూ వచ్చింది. నిజా నిజాలను తర్కించి పరికించిన వాళ్ళెవరూ ఆ గ్రామంలో లేనే లేరు. అయినా ఎవరికి పట్టింది? ఎవరి గొడవలతో వాళ్ళు సతమతమౌతూంటారు. బయట వాళ్ళ సంగతి కలుగజేసుకోవడానికి వాళ్ళకెక్కడ తీరుతుంది? అట్లాగని అందరూ మెదలకుండా వూరుకున్నారనుకోవడం కూడా పొరపాటు. వీరభద్రరాజు గారి లాంటి పెద్దలు ఒకరిద్దరు వారివారికి తోచిన సలహాలు ఇస్తూనే వున్నారు. కాని రామయ్య గారి పెద్దబ్బాయికి మరింతగా పిచ్చి ముదిరిపోయింది.

ఇంతకూ ఈ పిచ్చివాడి చేష్టలు పిచ్చిడాక్టర్లకుకూడా అంతుబట్టడంలేదు. బాగా చదువుకున్న వాడు. మాటా - మర్యాదా తెలిసినవాడు. మరి పిచ్చివాడెలా అయినాడనేదే ఓ పెద్ద జనమేజయ ప్రశ్న! ఇంట్లో వస్తువులు తీసుకు పోయి బయట పారేస్తున్నాడా అంటే అదీ లేదు. పోనీ బయట చెత్తా చెదారం తెచ్చి లోపల పడేసి ఖంగారు చేస్తున్నాడా అంటే అది అంతకు ముందే లేదు. అయితే సంపాదించుకుని తెచ్చి పడెయ్యలేదని రామయ్యగారికి గుణిసింపు ఎక్కువైంది. తను యిరవై సంవత్సరాలుగా పెట్టిన పెట్టుబడి అంతా దండగలమారి వ్యాపారం క్రింద తయారైతే ఆయనగారికి పిచ్చెక్కి పోయి అదికాస్తా తీసుకొచ్చి కొడుకు నెత్తిన రుద్దుతున్నాడని ఆ వూళ్లో ఒకరిద్దరు పిచ్చి వాళ్ళు అంటూండే వారుగాని వాళ్ళనోరు మూయించడానికి రామయ్యగారు తల్చుకుంటే అందుకోను ఇప్పుడు వీరభద్రరాజుగారి విలువైన సలహాలు సమర్పించి రక్షిస్తే, అదొంకమూ తం పరి ఇప్పుడు ఈ పిచ్చివాడి పీడ వదిలించుకోవాలంటే ఏమిటి మార్గమూ అని రామయ్యగారు మథన పడుతున్నాడు. వీరభద్ర రాజుగారు వెంటనే కిటుకులు చెప్పకుండా వూరుకుంటాడా?

ఒకనాడు రాత్రిపూట తీర్గ్గా భోంచేసి చుట్ట నోట్లో పెట్టుకుని బజారువాకిట్లో కూర్చుని వాళ్లిద్దరూ మీమాంస జరపడం మొదలెట్టారు.

'మీరిలాగే పట్టీపట్టనట్టుగా వూరుకున్నారా అంటే వాడు మీకొంప గుల్లచేసి పోతాడు. నామాట వినండి' అన్నాడు మాటలమధ్యలో వీరభద్రరాజుగారు.

'ఏమిటోనయ్యా పంతులూ! కన్నకడుపు తీపి చంపుకోలేకుండా వున్నాను. భగవత్ చిత్రం! దానికుంపటెగ! తెగతెంపులు చేసుకుందామని అనుకోవడమేగాని మళ్ళీ మనస్సు పీకుతూ వుంటుంది. అయినా నాకూ రాను రాను విసుగు పుడుతున్నది.'

'అదిగాదండీ ఎన్నాళ్ళని ఇట్లా వాడిని అచ్చుబోసిన ఆంబోతులా మేపుతూ కూర్చుంటామూ అంట! వాడి చారెడు వాడికవతలపారేస్తే ఆ దరిద్రప్పీడ విరగడై పోతుంది. పైసా పైసా తేల్చేస్తేగాని వాడికి తెలిసిరాదు. కుండ బద్దలు చేసిన మర్నాటినుండీ వాడికి పిచ్చి కుదిరిపోతుందంటే నమ్మండి.'

రామయ్యగారు ఏమిటో ఆలోచిస్తున్నాడు. పట్టుజారవిడిస్తే మళ్ళీ రామయ్యగారు ఇంకో పంథా తొక్కుతాడేమోనని వీరభద్రరాజు గారు తిరిగి ప్రారంభించాడు.

'నేనొక సంగతి చెబుతా వినండి. వెనక మా తాతగారి వూళ్ళో ఓ సన్యాసి ఇట్లాగే తయారయ్యాడు. ఎం. ఏ. ప్యాసైన తర్వాత ఆర్నెల్లు ఆ వుద్యోగమనీ ఈ వుద్యోగమనీ కాలుగాలిన పిల్లిలా తిరిగి చివరకు రెవిన్యూ ఇన్స్పెక్టరుగా చేరినవాడు సంపాదన సోదరఖర్చుకు చాలక ఇంటికి ఉత్తరాలు వ్రాస్తూండేవాడు అర్జంటుగా. మళ్ళీ మాట్లాడితే టెలిగ్రాం ద్వారా మనియార్డరు చేయవలసిందని. అప్పుడు చెరువూరులో జనరాజు ఆంజనేయులుగారనే ఓ పెద్ద తెలుగు ప్లీడరుగారు చెప్పిన సలహా ఏమిటయ్యా అంటే ఉన్న ఆస్తిలో అయిదు భాగాలు పరాయివాళ్ళ

కింద దాచి, కనపరచిన దాంట్లో మూడోవంతు ఆడపిల్ల పెళ్ళికిందా, నాలుగోవంతు చిన్నవాడి చదువుకనీ, అయిదోవంతు అయిదోతనం తక్కువైన తోబుట్టువు పోషణక్రిందా మినహాయించి మిగిలినదాంట్లో సగానికి సగం పోయేట్టుగా కుటుంబ రుణాలు సృష్టించి, దస్తావేజు ఖర్చుల క్రింద వందరూపాయలు ఎడంగా తీసిపెట్టి భాగం పంచవయ్యా! ఈ రోగానికి ఇంతకంటె మంచి మందు ఎవ్వరూ చెప్పేది లేదూ, అని. ఆ ప్రకారం జరిపించేశారు. దాంతో ఆ ముండా కొడుకు కిక్కురుమనకుండా వెళ్ళిపోయి కింద బడ్డాడో మీదబడ్డాడో వాడి గొడవలు వాడే చూచుకున్నాడు.'

'అయితే యేమంటారూ! మనం కూడా అలా చేస్తే బాగుంటుందంటారా? లోకం నవ్వి పోతుందేమో! అన్యాయం చేశాడని చెప్పి నన్ను ఆడిపోసుకుంటారని భయంగా వుంది. ఇంకో ఏడాదిపాటు చూస్తే వాడికే కాలు కుదిరి ఓ దరికి చేరుకుంటాడు.

'ఏమిటండీ, ఇంకా ఇంకా ఉపేక్షించడం! మీరు గనక ఇన్నాళ్ళూరుకున్నారుగాని మరొకరైతే ఈపాటికెంత చరిత్ర తయారయ్యేదో? ఒకసారి మెడ్రాసు హైకోర్టు అడ్వకేటుగారు ఒకాయన ఉపేక్షించడం అనేది వ్యవహారంలో ఎన్నడూ పనికిరాదు, పరిపరివిధాల చెరుపు తెస్తుంది అన్నాడు.'

'సరే కానివ్వండీ, ఇంకా వాడికి చిన్నతనమేగా! ఏదో కుర్రచేష్టలు ఎల్లకాలం వుంటాయా? కాస్త వెనకాముందు ఆలోచించడం మంచిదేమోనని నా వుద్దేశ్యం.'

'ఆఁ. చిన్నతనమూ చట్టుబండలూ! ఇప్పుడు తెలిసి రాకపోతే ఇంకెప్పుడండీ వాడికి జ్ఞానం వచ్చేది?'

రామయ్యగారు లోలోన ఏమిటేమిటో సణిగాడుగాని పైకి మాత్రం యేమాట దొర్లి రాలేదు.

వీరభద్రరాజుగారు తన తెలివి తేటలన్నీ ఉపయోగించి, పాతకేసుల్లో అనుసరించిన పద్ధతులన్నీ స్మరణకు తెచ్చుకుని రామయ్యగారి పెద్ద కొడుకు కుండ వేరు చేయించడంలో కృతార్థుడయినాడు.

వేరుబడ్డ పెద్దకొడుకు వ్యవహారం ఎలావుందో కాస్త పట్టించుకునేందుకు ఎంతమాత్రం తీరిక లేకుండా మరొక గడ్డు సమస్యను ఎదుర్కొనవలసి వచ్చింది రామయ్యగారు.

చిన్నకూతురు కాపురం ఇప్పటికి పది పదిహేనుమాసాలనుంచీ కలగా పులగంగా వుండిపోయింది. నాలుగురోజులు అత్తవారింట్లో వుంటే అయిదోనాడు ఉదయానికల్లా పుట్టింటికి వచ్చేసెయ్యడం, మరి అయిదు నెలలు ఏం చెయ్యాలో ఆలోచించుకోవడంతో గడిచిపోతూ వచ్చింది.

'దాని శిక్ష తెగ్గొయ్య! ఆ అత్తముండ ఏం కిలాడీ యెత్తు లేస్తుందయ్యా పంతులూ? అసలు మొగుడు మొద్దులయ్యకు మొగతనం వుంటే ఆడదాని పెత్తనం సాగనిస్తాడుటయ్యా!'

'అందుకే ఆడపెత్తనం అన్నారు' బాగా అందుకున్నాడు వీరభద్రరాజుగారు.

'ఈ కాపురం కడతేర్చే మార్గం ఏమీ అంతుపట్టడం లేదు. ఏం చెయ్యమన్నాడో భగవంతుడు?' 'ఈరోజుల్లో అణిగిమణిగి వున్నదగ్గరనుంచీ మరింతగా అణగారిపోవడమేగాని దయదల్చే వాళ్ళెవరూ లేరండీ. కరుకుతనం ఉంటేనేగాని ఎప్పటికైనా సరే ఆడది లొంగిరాదంటే నమ్మండి' వీరభద్రరాజుగారు తన విశేషానుభవ శేముషిని వెల్లడిచేశారు.

'అసలు ఆడాళ్ళకున్న లక్షణమే అదయ్యా. కాలికింద బెట్టి పరపరా నల్లిలాగా రాస్తుంటేనే వాళ్ళు ఇంకా ఎగిరెగిరి పడుతూ వుంటారు.

'హుటాహుటిగా ఎదురుపడి పోరాడితేకప్ప వాళ్ళు మనమాట ఆలకించరంటే నమ్మండి. ఒక్కసారి బాగా నసాళానికంటేట్టు మనం చర్య తీసుకుంటే ఆముండ చెప్పుకింద తేలులాగా పడి వుండదూ?'

'దానమ్మకడుపు కాలిపోను! ఆ దరిద్రపు ముండ ఎంతకైనా తెగించుతుందయ్యా! మన మేదన్నా కాస్త ఎదురు తిరిగామా అంటే వ్యవహారం చెడిపోయి కాపురానికి ముసలం పుడుతుందేమోనని జంకుతున్నాను. లేకపోతే ఇన్నాళ్ళా? ఇచ్చుకున్న వాళ్ళంగాని పుచ్చుకున్న వాళ్ళంకాదు గదా!'

'అయితే మాత్రం ఏమిటండీ, మానాభి

మూశాలు చంపుకుని వెళ్ళినాడు కాళ్లుకడిగింది చాలక, ప్రతిరోజూ వీళ్ళకు వొంగివొంగి దణ్ణాలు 'పెడతామా ఏమిటండీ!'

'ఈ సారి దీని అంతు కనుక్కోవాల్సిందే నయ్యా పంతులూ'

'మనోవర్తికి దావావేయ్యండి. గిర్రున తిరిగొస్తుంది ఆ గుంట. మన కాళ్లమీద మోకరిల్లుతుందంటే నమ్మండి. ఆస్తి పోతుందనే సరికి దానికి గుండెలు నాకిసి పోతాయి గదండీ' అంటూ వీరభద్రరాజుగారు ఈ కథను కంచెకు చేర్చేందుకు యథోచితంగా సలహా ఇచ్చేశారు.

ఒక మాసం రోజులు గడిచే లోగా రామయ్యగారి చిన్న కుమార్తె ఇక శాశ్వతంగా పుట్టింటిలోనే మకాంవేసే పరిస్థితికి వచ్చింది. తల చెడిన కూతురుతో పాటు పసుపు కుంకుమ పెట్టుకున్న కూతురుగూడా సమానంగా పడివున్నది. రామయ్యగారు ప్రజ్ఞలకు పోయి చేసిన పనికి కొంతవరకూ పశ్చాత్తాప పడ్డాడు. కాని ఎన్నాళ్ళని అటా కుళ్లి పోతాడు!

సంసార తాపత్రయం అంటే కష్టమొచ్చినప్పుడు కాసేపు కించపడినా మళ్ళీ అన్నిపనులూ యథాప్రకారం సాగి పోతూండాల్సిందేగదా' అని తత్వం బోధించాడు శ్రీ వీరభద్రరాజుగారు.

రోజు రోజుకీ ఆ సంసారంలో వింతవింతగా క్రొత్త సమస్యలు బయల్దేరుతూ ఉంటే రామయ్యగారికి పూర్తిగా మతి చెడి పోయింది. ఇప్పుడు కేవలం వీరభద్రరాజుగారి అండదండల మీదనే ఆధార పడివుండాల్సిన స్థితికి వచ్చేశాడు. ఏమంత పెద్దతనం కాకపోయినప్పటికీ అప్పుడే ముఖం బాగా ముడుతలుపడి పోయింది. బుగ్గలు జారిపోయినాయి. నేడో రేపో ఆ వూళ్ళో వాళ్లందరికీ 'తాత' కాబోతున్నాడు. ఒకనాడు కర్రపోటు వేసుకుంటూ వాకిట్లో అరుగుమీదికొచ్చి కూర్చుని సాయంకాలం చల్లగాలి ఆరగిస్తున్నాడు. ఇంట్లో ఆడవాళ్లేదో రణగొణ ధ్వని చేస్తున్నారు. ఆయనకు విసుగుపుట్టి మొహం చిట్లించి పారేశాడు. ప్రక్కగదిలో పాత నోట్లు తిరగేస్తున్న వీరభద్రరాజుగారు ఆ గొడవేమిటో తెలుసుకుందామని వాకిట్లో రామయ్యగారి వద్దకు వచ్చి వాకబు చేశాడు.

'రెండో కోడలు సరిగ్గా చెప్పిన మాట వినటంలేదని ఇంట్లో ఆడవాళ్ళ గోలతో పడలేక చస్తున్నానయ్యా పంతులూ!'

'ఏమిటోనండీ, మాయలోకం, సంసారం అంటే ఎన్నిచిక్కులు? అన్నీ సరిగ్గా జరిగిపోతే యేదిగులూ లేదు. ఏ కాస్త చిటుక్కుమన్నా మనోవ్యాకులతతో పీక్కుచావాలి గదా! అందుకే సంసారం సాగరం అన్నారు పెద్దలు.'

'ఈ ఆడవాళ్లు ఇంట్లోసంగతులు ఏదోరకంగా వాళ్ళల్లోవాళ్లు సర్దుబాటు చేసుకోగూడదూ, నాదాకా తీసుకొచ్చి రచ్చకెక్కించి నన్ను వేధించకపోతే.'

'అదేమన్న మాటలెండి. కోడల్ని మందలించుకోవడం తప్పేముంది. మొగవాడేమిటి ఆడదేమిటి' బయటనుంచున్న వీరభద్రరాజుగారు ఇంట్లో ఆడవాళ్ళను వెనకేసుకొచ్చారు.

'నా కొడుకు ఈసంగతే పట్టించుకోడయ్యా, పంతులూ! వాడిదంతా ఇంగిలీషోళ్ళ పద్ధతి. పెళ్లానికి స్వాతంత్రం ఉండాలంటాడు. వాడి మొహం! వాడికసలు తెలిస్తేగా, కాస్త చనువు ఇస్తే రేపీపాటికి వాడి నెత్తిమీదే ఎక్కి కూచుంటుందని.'

'ఆఁ. బాగా అన్నారు.' అంటూ తూచినట్టుగా ఉదాహరణలు చెప్పడం మొదలెట్టాడు వీరభద్రరాజు. 'వెనక మా మేనమామ ఇలాగే చెబుతూండేవాడు — ఆడదానికి నెలకొక మాటయినా సరే తగిలించకపోతే చెప్పినమాట వినదూ అని. ఏమీ కారణం దొరక్కపోయినా, ఏదోటి ఓ కుంటిసాకు వెతుక్కొని బాదుతూ వుండాలని కూడా ఆయన అంటూవుండేవాడు. ఓసారి ఆయన వరండాలో తీరిగ్గాకూర్చున్నాడు, పెళ్లాన్నికొట్టి చాలారోజులైందే అని ఆలోచిస్తూ. ఇంతలోకే మా మేనత్త ఇంట్లోనుంచి వచ్చి ఆయన ముందుగా ఆయనకేసి వీపుబెట్టి నడిచిందట! ఇంకేముంది? ఆవెంటనే ఉగ్రుడై లేచి బజారువాకిట్లో దోవనబోయేవాళ్లు చూస్తున్నారే మోననే అభిమానం గూడా చంపుకుని గబగబా ఆమెకొప్పు బుచ్చుకుని లోపలకు ఈడ్చుకొచ్చి 'ఛడవా! నాకు రొమ్ములు చూపిస్తూ నడవాల్సిందానివి వెన్ను చూపిస్తావుటే' అంటూ చీపురుకట్ట తీసుకుని వేశాడు.

అంతటితో ఆ దయ్యపుచేష్టలు తిరిగి తలయెత్త లేదని ఆయన చెబుతూండేవాడు.'

'ఇంతకూ నాకొడుకు వొట్టి అసమర్థుడు కాక పోతే పెళ్ళానికి మర్యాద చూపించడమేమి టయ్యా!'

'మీవాడితో గట్టిగా చెప్పేసెయ్యాలండీ ఈ విషయంలో మాత్రం నేను చూస్తూ వూరు కోలేను. పెద్దా చిన్నా గమనంలేకుండా నిన్న గాక మొన్నొచ్చిన పెళ్ళాంచేత రాజ్యం ఏలి స్తాడా? ఏమిటి వాడి మిడిసిపాటు! మనకందరికీ గాజులు తొడిగి కోర్నోబెడతాడుగా!' సింహగర్జన చేశాడు వీరభద్రరాజుగారు.

క్యాలండరులో పేజీలు ఒక్కొక్కటే చినిగి పోతూన్నవి గాని రామయ్యగారికి మాత్రం మనశ్శాంతి చేకూరలేదు. తన ఇంటిగొడవల్లో ఎందులో చెయ్యిబెట్టినా గోకుడుపుండు బ్రహ్మ వ్రణమై కూర్చుంటున్నది. అన్నింటికీ బాధ్యతను ప్రారబ్ధంపై రుద్దేసి చేతులుకడుక్కుని కూర్చుంటే తీరిపోతుందనే తత్వంలోకి ఇంకా దిగజారిపో లేదు. వేరుబడ్డ కొడుకూ కోడలూ, ఇంట్లో ఎడమొఖం పెడమొఖంగా వున్న కొడుకూ కోడలూ, ఖర్మం అంటూ ఏడుస్తూన్న కూతురూ- అంతా అయోమయంగా వున్నప్పటికి ఇంకా ఏమిటేమిటో ఉద్ధరించి పారేశెయ్యాలనే తాపత్రయం మాత్రం తగ్గిపోలేదు.

తల చెడిన కమాత్రె హైలావచ్చిడుగా పచ్చ పచ్చగా వేషాలు వేస్తున్నదనే వినికిడి ఆయన గారి చెవికి గూడా సోకింది. అసలేకుళ్ళిపోతున్న రామయ్యగారికి ఇది మరింత కంటకంగా తోచింది. దాంతో మళ్ళీ చెట్టుక్రింద ప్లీడరు గారిని కనును చేసి ఓ పెద్ద సమావేశం జరపా ల్సిన అవసరం కలిగింది.

'దాని తస్సాగొయ్యా! ఆ ఎదురింట్లోకి కొత్తగా వచ్చిన బస్తీ ముండ వుందే, దాని పేరేదో వుండాలి కామాక్షో, నాగులో రుద్రాక్షో అది కానరాని చీలి పుతులా! అదే నేర్పుతున్నదయ్యా అన్నీను. ఇంతకు మునుపు మా అమ్మాయెన్నడూ అట్టాంటి విషయాలు ఎరగదయ్యా!'

'అవునండోయ్. మీరు సూటిగా పసిగట్టే శారు. దాని అన్న ఒకడున్నాడు చూడండీ,


# ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్

స్థాపితము : 1923

హెడ్డాఫీసు : మచిలీపట్టణము

మదరాసు బ్రాంచి :
బాంబే మ్యూచియల్ బిల్డింగ్
378, ఎస్ప్లనేడ్.

త్యాగరాయ నగర్ ఆఫీసు :
18/28 పాండీ బజారు.

మైలాపూర్ ఆఫీసు :
49, కచేరీ రోడ్డు.

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు

మచిలీపట్టణము, నెల్లూరు, తెనాలి గుంటూరు, బెజవాడ, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణము, విజయనగరము, తిరుపతి, కర్నూలు, గూడూరు, ఒంగోలు. చీరాల, దుగ్గిరాల, నరసారావుపేట, వినుకొండ, అరండల్ పేట (గుంటూరు), గవర్నరుపేట (బెజవాడ), గుడివాడ, పాలకొల్లు భీమవరం, సామర్లకోట, రామారావుపేట. (కాకినాడ), పిఠాపురం, తుని, అనకాపల్లి చికాకోల్ (వైజాగ్), పెద్దాపురం, అమలాపురం, ఆముదాలవలస, తిలారు, పెడన (కృష్ణా), సాలూరు, చల్లపల్లి, మహారాణిపేట, (విశాఖపట్టణము), జగ్గయ్యపేట (కృష్ణా), గొల్లప్రోలు (తూ. గో.) బాపట్ల (గుంటూరు)

వివరము లే ఆఫీసులోనైనను తెలిసి కొనవచ్చును.

తాడేపల్లి శ్రీరాములు
మేనేజింగ్ డైరెక్టర్.

ఇ. రామచంద్రమూర్తి,
ఎమ్. ఏ. సి. ఏ. ఐ. ఐ. బి.,
జనరల్ మేనేజరు.

గిరజాల జుట్టు ఎగదువ్వి గోల్డుఫ్లేకు సిగరెట్టు తబ్బా చేతబుచ్చుకుని పోతూ వుంటాడే వాడు నడిపిస్తున్నాడండీ ఈ గ్రంథం అంతాను.'

'మన ప్రారబ్ధంకొద్దీ వాడెక్కడ దాపురించాడయ్యా మనకూ. ఈ వంశంలో యే నాడూ ఎరగం కదా ఇలాంటి అభాండాలు. ఇన్నాళ్లూ మా అమ్మాయి తడిగుడ్డ చుట్టుకుని తులసికోట చుట్టూ తిరుగుతూ కాలక్షేపం చేస్తుండేది. ఇప్పుడేం పోయేకాలమొచ్చిందో దానికీ అపరబుద్ధి పుట్టింది.'

'అసలు ఈ బస్తీ ముండాకొడుకుల్ని వూళ్లో జేరనియ్యడమే తప్పు. వుండి వుండీ కొంపలంటించేస్తారు కదా! వాడి జల్దియ్యా! వాడి చూపెప్పుడూ ఆకాశం మీదకే వుంటుందేమండీ'

రామయ్యగారు ఇంకా దీర్ఘంగా ఆలోచిస్తూ గుడ్లు రెండూ అప్పగించి వూరుకున్నాడు.

'ఉండండి. రేపీపాటికి వాడి సంగతేమిటో తేల్చేస్తాను. ఏదో వంక జేసుకుని వాణ్ణి నుంచోబెట్టి కడిగేస్తానుండండీ' అంటూ ధైర్యం చెప్పాడు వీరభద్రరాజుగారు.

అన్నంతపనీ చేసి మాట నిలబెట్టుకున్నాడు కూడాను. వాడు ఎంతకూ లొంగిరాక పోతే చివరకు యోచించి యోచించీ ఓ బ్రహ్మాండమైన ఎత్తువేసేశాడు. 'కమ్యూనిస్టు అని చెప్పి పోలీసులకు పట్టిస్తాను జాగ్రత్త' అనే తురుపు ముక్కతో వాడి ఆట కట్టించేసి సలాం చేయించి మరి వాణ్ణి ఆ యింట్లోనుంచి వెళ్ళగొట్టించాడు.

చేసిన పుణ్యం ఎక్కడికి పోతుందీ అనే వుద్దేశ్యంతో పాపం దయదల్చి వీరభద్రరాజుగారు ఆ 'విధవ'ను పోలీసులకు పట్టించకుండా వొదిలిపెట్టాడు. మరి చేసిన పుణ్యం ఎక్కడికీ పోనప్పుడు ఆయన సిద్ధాంతాన్ననుసరించే చేసిన పాపం మాత్రం మూటగట్టుకుని నిల్వ వుండకుండా ఎక్కడికి పోతుంది?

యేణ్ణర్థం క్రిందట ఓ సారి జిల్లా మునసబు కోర్టులో వీరభద్రరాజుగారి గురువుగారు తప్పుడు దస్తావేజులు వ్రాసిన సందర్భంలో విచారింపబడగా, వీరభద్రరాజుగారు గురుదక్షిణకిందకూడ సాక్ష్యం పలికేశారు, మంచినీళ్ళ ప్రాయంగా, ఇది మనలను ఏం చేస్తుందిలే అంటూ. ఏం చేస్తుంది! శ్రీకృష్ణ జన్మస్థానంలో ఆరుమాసాలు నివాసం చేయాలంటూ ఉత్తరువు లొచ్చాయి. కనక అర్ధసంవత్సరంపాటు ఆ గ్రామాన్ని ఉద్ధరించే ఏకైక నాథుడు లేకుండా పోయినాడన్న మాట!

జైల్లో నాలుగు గోడలమధ్య నాలుగునెలలు పాటు మకాంవేస్తే సాధారణంగా మానవత్వం గల మనిషి మెదడు ఉడికిపోతుందని చెప్పుకుంటూ వుంటారు. కాని చెట్టుకింద ప్లీడరుగారు మాత్రం చెక్కు చెదరలేదంటే నమ్మండి. పైపెచ్చు గోదావరి నీళ్లు బాగా వంటబట్టి అత్తవారింట్లో మనుగుడుపుకు పోయొచ్చిన అల్లుడు మోస్తరుగా ఆయన ఇంకో అంగుళం మందం ఎక్కి మనోభావు పరిమిపొంది ఆరుమాసాల అనంతరం విడుదలపొంది హాయిగా కొంప జేరుకున్నాడు.

వీరభద్రరాజుగారు తిరిగి స్వగ్రామం చేరుకునే సరికి జైలుకు వెళ్ళకముందు ఆయన సముద్ధరించిన కుటుంబంలో చాలాచాలా మార్పులు వచ్చేశాయి. పాపం! రామయ్యగారు కాస్తా కాలం చేశాడు. ఆయనగారి కుమాళ్లు ఇద్దరూ కలిసి ఒకే కుండలో తింటున్నారు. మనోవర్తి పుచ్చుకున్న చిన్నకూతురు వెనుకటిదంతా మర్చిపోయి నిక్షేపంగా కాపురం చేస్తున్నది. సంక్రాంతి పండగకని పుట్టింటికొచ్చింది పెనిమిటితో సహా. చిలకా గోరువంకల్లా ఆనందంగా తిరుగుతున్నారు ఇంట్లో. తల చెడిన కూతురు వితంతు శరణాలయం చేరి మళ్ళీ పెళ్ళి చేసుకుని అన్నలను చూచి పోయేందుకు భర్తతో కూడి ఆ గ్రామం వచ్చింది.

వీరభద్రరాజుగారు తాను నిర్మించిన 'ఇల్లు' కూలిపోయిందే అని ఉక్రోషం పట్టలేక పళ్లు పిండి చేసుకున్నాడు. చూడగా చూడగా ఆయనకు అదంతా అగమ్యగోచరమైపోయింది. ఆర్నెల్లలోనే భూమి తల్లకిందలైందే అని ముక్కు మీద ఒకటికి రెండువేళ్లు వేసుకున్నాడు.

అంతటితో ఆయన పరిణామం పొందుతాడనుకోవటం ఆయనతత్వం బొత్తిగా తెలియక పోవడమేనన్న మాట. బొందిలో ప్రాణం ఉన్నంతవరకూ ఆరు నూరుగానివ్వండి నిన్నూ మన్నూ ఏకం కానివ్వండి, వీరభద్రరాజుగారు తన శక్తి సామర్థ్యాలను ఎక్కడో క్కడ ప్రదర్శించకుండా వుంటాడా?